

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

## సకల్ బన్ ఫూల్ రహీ సర్సోన్

ఇటీవలే ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రదర్శితమయిన 'హీరామండీ' సీరియల్ చూసినవారు, సీరియల్ చూడనివారు కూడా ఈ పాటను గుర్తుంచుకుంటారు .'బహార్' రాగంలో 'రాజా హసన్' చక్కగా పాడిన ఈ పాట దృశ్యంగా కూడా నయనానందకరంగా ఉంటుంది. పసుపు రంగు దుస్తులలో అందమైన యువతులు, అంతా హుందా అయిన నృత్యాన్ని అత్యంత సుందరంగా చేస్తూంటే, పాటల చిత్రీకరణను ఉత్తమ స్థాయిలో రూపొందించే సంజయ్ లీలా భన్సాలీ అందించిన ఈ  పాటను చూడటం ఒక మరుపురాని అనుభూతిగా నిలుస్తుంది.

'సకల్ బన్ ఫూల్ రహీ సర్సోన్' పాట గత ఏడువందల ఏళ్లుగా సాహిత్య సంగీత ప్రపంచాలను ఉర్రూతలూపుతున్న పాట. వసంత ఋతువు ఆగమనాన్ని ఉత్సాహంగా ఆహ్వానిస్తూ సంబరాలు జరుపుకునే సాంప్రదాయక గీతం ఇది. బహార్ రాగానికి సంతకంలాంటిదీపాట.

1966లో విడుదలయిన 'మమత' సినిమాలో రోషన్ సంగీత దర్శకత్వంలో 'సాంప్రదాయిక పండుగ సంబరాల గీతాన్ని అనుసరిస్తూ రూపొందించిన అందమైన గీతం సకల్ బన్ ఫూల్ పాట పంథాలోనే సృజించిన బహర్ రాగానికి గుర్తులాంటిదీపాట .

సకల్ బన్ గగన్ పవన్ చలత పూర్వాయీ రీమాయీ

ఋత్ బసంత్ ఆయి ఫూలన్ ఛాయి బేలరియా

డార్ డార్ అయివా కీ కోహరియా

రహీ పుకార్ ఔర్ మేఘ్వా  బూందన్ ఝుర్నాయీ

## సకల్ బన్ గగన్ పవన్ చలత్ పుర్వాయిా ఆయిరే.

అతి సుందరమైన సాంప్రదాయిక రచన పల్లవిలో మొదటి పాదం తీసుకుని బహార్ రాగానికి బందిష్ లాంటి గీతాన్ని రచించాడు మజ్రూహ్ సుల్తాన్ పురి .

వసంత ఋతువు ఆగమనాన్ని హర్షిస్తూ అందంగా మారుతున్న వాతావరణాన్ని, పూస్తున్న రంగురంగుల పూలనీ వర్ణిస్తూ, అతి గొప్పగా పాటను సృజించాడు మజ్రూష్. 'సకల్ బన్  గగన్ పవన్ చలత్ పుర్వాయిారే' అన్నది సాంప్రదాయక రాగం 'బహార్' చెందిన బందిష్. దీన్ని ఆధారం చేసుకుని అదే పంథాలో మిగతా పాటను రచించాడు మజ్రూహ్.

అయితే 'బహార్ రాగం' కోసం అధికంగా వాడే బందిష్  దాదాపుగా 700 ఏళ్లనుంచీ అమలులో ఉంది. ఆ 'బందిష్ 'ను రచించింది 13వ శతాబ్దికి చెందిన సూఫీ 'హజ్రత్ అమీర్ ఖుస్రో '. హీరామండీ సినిమాలో వాడింది అమీర్ ఖుస్రో రచించిన గీతాన్నే.

భారతీయ సాంస్కృతిక ప్రపంచాన్ని అమీర్ ఖుస్రో తిరుగులేని రీతిలో ప్రభావితం చేశాడు. హిందుస్తానీ సంగీతంలో, హిందీ, ఉర్దూ కవిత్వ ప్రపంచంలో అమీర్ ఖుస్రో ప్రభావం నుంచి  తప్పించుకున్న వారు లేదనటం అతిశయోక్తికాదు, అనృతం కాదు.  ఇంకో అడుగు ముందుకు వేసి భారతీయ సాహిత్యంలో కూడా అమీర్ఖుస్రో ప్రభావం నుంచి తప్పించుకున్నవారు అరుదు అనికూడా అనవచ్చు.

ఈనాడు బహార్ రాగానికి ఉదాహరణగా వాడే 'బందిష్' కు మూలం అమీర్ ఖుస్రో గీతంలో ఉంది.

'సకల్  బన్ఫూల్ రహీ సర్సోన్'

'తోటలన్నీ విరబూస్తున్న ఆవాల పూలతో నిండి ఉన్నాయి. ఇది ఆరంభ వాక్యం. ఆవాలపూలు పసుపు రంగులో ఉంటాయి. అందుకే సినిమాలో నృత్యగత్తెలంతా పసుపు రంగు బట్టల్లో  ఉంటారు.

'అమీర్ ఖుస్రో గీతాలు నర్మగర్భితంగా, ఎన్నెన్నో అగాధమైన ఆలోచనలను తమలో పొదుగుకుని ఉంటాయి. కానీ ఈ గీతం అతి సరళమైన పదాలతో, సుందరమైన వర్ణనలతో లలితంగా ఉంటుంది.

సకల్  బన్

అంబువా పూటే తేసూపూలే

గోరీ కరత్ సింగార్

మాలనియా  గర్వవా లే ఆయి ఘర్ సోన్య  సకల్ బన్

మామిడి పూమొగ్గలు పూలలా రూపాంతరం చెందుతున్నాయి. ఇతర పూలు కూడా విరగబూస్తున్నాయి. యువతి అందంగా అలంకరించుకుంటోంది. పూల బుట్టలు పట్టుకుని యువతులు వనాలలోకి వచ్చారు.

సుందరమైన దృశ్యాలను కళ్లముందు నిలుపుతున్నాడు అమీర్‌ఖుస్రో. రకరకాల రంగురంగుల పూలు విరబూయటం, అందంగా అలంకరించుకున్న అమ్మాయిలు బుట్టలు పట్టుకుని పూతోటలలోకి రావటం, ఒక ఆనంద సంబరాల వాతావరణాన్ని అతి సుందరంగా వర్ణిస్తున్నాడు అమీర్‌ఖుస్రో.

తరహ తరహ కే పూల్ మంగాయే

లే గర్వ్వా  హాథన్ మే ఆయే

నిజాముద్దీన్ కే దర్వాజే పర్, మేరీ నిజాముద్దీన్ కే దర్వాజే పర్

వో మోహె అవన్ కహెగయే  ఆషిక్  రంగ్ జార్ బీత్ గయే బర్సోం

సకల్ బన్ పూల్ రహీ సర్సోన్

పలురకాల పూలను బుట్టలలో తీసుకుని వస్తున్నారు అమ్మాయిలు. నిజాముద్దీన్ గృహద్వారం ముందు కలుస్తానని వాగ్దానం చేసి, నన్ను రమ్మని తాను రాలేదు. సంవత్సరాలు గడిచిపోయాయి.

ఈ గీతాన్ని అమీర్ ఖుస్రో రచించటం వెనక ఓ కథ ఉంది.  అమీర్‌ఖుస్రో నిజాముద్దీన్ ఔలియా భక్తుడు. హజ్రత్ నిజాముద్దీన్ ఔలియాకు సంతానంలేదు. తను సోదరి కొడుకుని స్వంత కొడుకులా ప్రేమించాడు. అయితే ఆ పిల్లవాడు అనారోగ్యంతో మరణించాడు. పిల్లవాడి మరణం నిజాముద్దీన్ ఔలియాను బాధించింది. ఆయన వదనంపై నుండి నవ్వు ఎగిరిపోయింది.

తన గురువు దుఃఖించటం అమీర్ ఖుస్రో చూడలేకపోయాడు. ఎలాగయినా గురువును సంతోషపెట్టి అతడిని నవ్వించాలని తపనపడ్డాడు. ఒకరోజు ఆవాలపూలు, ఇతరపూలు అందంగా అలంకరించి పసుపు దుస్తుల్లో పెద్ద సంఖ్యలో వెళ్తున్న మహిళలు అతడికి కనిపించారు. విషయం అడిగాడు. వారంతా దైవానికి పూలు అర్పించేందుకు వెళ్తున్నారు. ఈ పూలు అర్పించటం దేవుడికి సంతోషం కలిగిస్తుందని చెప్పారు.

అది విన్న ఖుస్రో తానూ పసుపురంగు పూలు తీసుకుని, చీర ధరించి పాటపాడుతూ నిజాముద్దీన్ ఔలియా దగ్గరకు వెళ్లాడు. ఖుస్రో దుస్తులను చూసి నిజాముద్దీన్ నవ్వాడు. పాటకు సంతోషించాడు. ఖుస్రో నిజాముద్దీన్ దగ్గరకు పాడుతూ వెళ్లిన పాటనే 'సకల్ బన్ ఫూల్ రహీ సర్సో' పాట. ఈనాటికీ నిజాముద్దీన్ ఔలియా వద్ద ప్రతి సంవత్సరం ఈ విధమైన 'పూజ' జరుగుతుంది. పసుపు రంగు దుస్తులలో పసుపు రంగు పూలునిండిన పళ్ళేలతో హిందూ ముస్లీములు నిజాముద్దీన్ ఔలియా సమాధివద్ద ఈ పూజా సంబరాలు ఘనంగా నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతోంది.

ఇక్కడ గమనించాల్సినవి పలు అంశాలున్నాయి.

ఏరకంగా భారతీయుల సాంప్రదాయ పూజా గీతాన్ని అమీర్ఖుస్రో 'సూఫీ' గీతంగా మలచాడో గమనించాల్సి ఉంటుంది. భారతీయ పండుగలు, పద్ధతులను కొద్దిగా మార్చి ఇస్లాంలో ప్రవేశపెట్టటం ద్వారా ఇస్లాంను భారతీయులకు మరింత చేరువ చేశాడు ఖుస్రో. స్థానికుల పూజా పద్ధతులను అవలంబించటంద్వారా మతం మారటాన్ని ఆమోదయోగ్యం చేశాడు. ఈ పద్ధతి ఇప్పటికీ కొనసాగుతోంది. హిందూ పూజా పద్దతులను అనుసరిస్తూ ఇతర మతాలవారు హిందూ ధర్మానుయాయులను తమ మతంవైపు ఆకర్షించాలని ప్రయత్నిస్తూన్నారు. ఈ పద్ధతికి శ్రీకారం చుట్టింది అమీర్ ఖుస్రో.

అందరూ సులభంగా పాడుకునే రీతిలో పాటలు రచించి, చివరలో నిజాముద్దీన్ ప్రస్తావన తెచ్చి అందరిచే ఇస్లాం గీతం పాడించాడు. చివరలో ప్రియుడు నిజాముద్దీన్ ద్వారం వద్దకు రమ్మన్నాడు. ఇంతవరకూ రావటంలేదన్న వాక్యాలతో ఒక సుందరమైన వర్ణన పాటను భక్తిగీతంలా, ఆధ్యాత్మికగీతం స్థాయికి ఎదిగింపచేశాడు ఖుస్రో.

భగవంతుడిని ప్రియుడిలా, తనను ప్రేయసిలా భావించుకుని, భగవంతుడి రాక కోసం ఎదురుచూస్తూండటమనే ఆలోచన తర్వాత కాలంలో భారతీయ కవిత్వ ప్రపంచంలో స్థిరపడింది. ముఖ్యంగా టాగోర్ గీతాంజలి గేయాలలో తనను తాను ప్రేయసిగా భావిస్తూ, ప్రియుడు ఆ వైపు వస్తాడన్న ఆశతో జీవితాంతం ఎదురుచూస్తూండే భావన, తాను ఏరుకొచ్చిన పూలు భగవంతుడికి పనికిరావేమోనన్న భావనలు అమీర్ఖుస్రో ప్రభావాన్ని పట్టిస్తాయి. టాగోర్ కవితలపై అమీర్ఖుస్రో ప్రభావం ఒక ప్రత్యేకమైన పరిశోధనాంశం.

'అమీర్‌ఖుస్రో' రాసిన హిందీ గీతాలు, కవితలయితే తరువాత సాహిత్యంలో సృజించిన 'ప్రేమ' పాటలన్నిటికీ ఆధారం. 'ఖుస్రో' గేయాలు అయితే, హిందీ సినీ గేయరచయితలకు పాఠాలు నేర్పగలిగేంతటివి.

నిజాముద్దీన్ ఔలియాను నవ్వించేందుకు ఖుస్రో పడిన తపన 'జంజీర్' సినిమాలో విషాదంలో ఉన్న 'అమితాబ్' పాత్రను నవ్వించేందుకు పఠాన్ పడ్డ తపనను గుర్తుకు తెస్తుంది. ఆ సందర్భంగా సినిమాలో ఖవ్వాలీ పాడతాడు.'యారీ హై ఈ మాన్ మెరా' అని ఆ ఖవ్వాలీలో ప్రేమ గొప్పతనం చెప్పి చివరలో హీరోని నవ్వమని వేడుకుంటాడు. హీరో నవ్వగానే అంటాడు

తెరా మమ్ నూన్ హు తూనే నిభాయా యారానా

తెరీ హసీ హై ఆజ్ సబ్ సే బడా నజ్రానా

యార్ కీ హస్తే హీ

మహఫిల్ మె 'జవానీ ' ఆగయీ

ఇక్కడ ప్రేమ దైవం. స్నేహం దైవం. ప్రేమకోసం ఎలా త్యాగం చెయవచ్చో, స్నేహంకోసం అలానే త్యాగం చేయవచ్చు. 'ఖుస్రో' ఆలోచనలను భగవంతుడి ప్రేమ నుంచి ప్రేమకు మళ్లించి, అటునుంచి స్నేహానికి వర్తింపచేశారు.

'హీరామండి'లో సంజయ్ లీలా భన్సాలి చిత్రించిన 'సకల్ బన్ ఫూల్' గీతంలో కూడా భారతీయ పద్ధతులు, ధార్మిక అంశాల ఆధారంగా సూఫీ సిద్ధాంతాన్ని ప్రవచించటం కనిపిస్తుంది.

సూఫీ సిద్ధాంతంలో ప్రధానమైనది ప్రేమ. భగవంతుడిపైన ప్రేమ ఎంత తీవ్రంగా ఉండాలంటే ప్రేయసి కోసం ప్రియుడు ఎలా తపిస్తాడో అంత తీవ్రంగా. ఈ సిద్ధాంతాన్ని సామాన్య జనులకు చేరువ చేసేందుకు ఆయన ఖవ్వాలీ, గజళ్ళనూ, సామాన్యుల బాషలతో పాటుగా, భారతీయ పురాణగాధలనూ ప్రతిభావంతంగా వాడుకున్నాడు. అప్పటికే భారతీయ సమాజంలో రాధాకృష్ణుల ప్రేమ 'జయదేవుడి' గీత గోవిందం' ద్వారా స్థిరపడింది. రాధా కృష్ణుడు, కృష్ణుడూ గోపికల ప్రేమను అత్యంత సుందరంగా వాడుకుని సమాజంలోకి ప్రేమ భావనను శక్తిమంతంగా విస్తరింపచేశాడు ఖుస్రో

బహుత్ కఠిన్ హై డగర్ పన్ ఘట్ కీ

**కైసే మై భర్‌లావూం మధ్వాసే మట్‌కీ**

ఇది వినగానే మనకు గోపికలు కృష్ణుడు గుర్తుకు వస్తారు. బావి దగ్గరకు వెళ్ళే దారి చాలా కఠినమైనది. నేను బావి నుండి నీళ్ళతో నా కుండను ఎలా నింపి తీసుకురావాలి? అంటోంది. మనకు దారి కాసి కృష్ణుడు గోపికల కుండలు పగలకొట్టటం గుర్తుకు వస్తుంది. బావి దాహం తీరుస్తుంది. బావి భగవంతుడు. భగవంతుడిని చేరే దారి కఠినమైనది. ఇక్కడే ఖుస్రో గొప్పతనం కనబడేది. భారతీయ ధార్మిక ప్రతీకలను 'సూఫీ ' తత్వానికి ప్రతీకలుగా చేశాడు.

**మోరే అఛ్ఛీ నిజాం పియా.**

**కైసే మై భర్‌లావూకి మధ్వా సే మట్కీ**

**ఔర్ బోలో నిజాం పియా –**

బావి దారి కఠినమైనది. కుండలో నీరు ఎలా నింపుకోవాలి? అని అడిగినవాడు ఇప్పుడు నా ప్రియుడవైన నిజాం, అంటే నిజాముద్దీన్ ఔలియా ఆరాధించే ప్రభువు, అంటే దైవం, నీళ్లు ఎలా నింపుకురావాలో కాస్త చెప్పు అని అడుగుతున్నాడు. అంటే కఠినమైన భగవదారాధనదారిని సుగమంచేయమని గురువు నిజాముదీన్ ఔలియాను ప్రార్థిస్తున్నాడన్నమాట.

**పనియ భరన్ కో మై జోగయీ థీ**

**ఔర్ ఝూపట్ మోరి మట్కీ మట్కీ**

**బహుత్ కఠిన్ హై ఖుస్రో నిజాం కె బలిబలి జైయ్యో**

**లాజ్ రాఖో మోరె ఘూంఘట్ పట్‌కీ**

నీళ్లు నింపేందుకు వెళ్లుతుంటే, దారిలోనే కడవలు విరిగిపోతున్నాయి. బావికి దారి చాలా కఠినమైనది నిజాం. ఖుస్రో జీవితం నిజాంకే అంకితం. నా పరువు నీవే కాపాడాలి. కడవలు పగిలిపోవటం ప్రతీకాత్మకం. కఠినమైన ఆధ్యాత్మికత దారిలో అందరూ నడవలేరు. ఆ కఠినమైన దారిలో కాస్త దూరంవెళ్ళి దెబ్బతింటారు. భవిష్యత్తులో ఇదే ప్రతీకను ప్రేమదారిలో ప్రయాణాన్ని సూచించేందుకు వాడేరు.

**నపాయీ కిసీనే మొహబ్బత్ కి మంజిల్**

**కదమ్ డగ్ మగాయే జరా దూర్ చల్కే...( ఉడాన్ ఖటోలా)**

. ఈ పాటలో భగవంతుడు , ఆధ్యాత్మికత ప్రసక్తిలేదు. కానీ, మామూలు భౌతిక ప్రేమ ఆధ్యాత్మిక ప్రేమ స్థానాన్ని ఆక్రమించటం తెలుస్తుంది. ఖుస్రో రాసిన గీతాన్ని ఖవ్వాలీ లా దర్గాలలో పాడతారు.

హిందీ సినీ ప్రపంచంలో ఖవ్వాలీల వ్యాపారాత్మకతను ప్రపంచానికి ప్రదర్శించిన సినిమా 1960లో వచ్చిన 'బర్సాత్ కీ రాత్ ' . సినిమా ప్రధానంగా 'ఖవ్వాలీ'ల చుట్టూ తిరుగుతుంది. నాయకుడు కవి. ఈ సినిమాలో 13 నిమిషాల ఖవ్వాలీ ఉంది. రాసింది సాహిర్ లూధియాన్వీ. 'నతో కార్వాన్‌కీ తలాష్ హై' అంటూ ప్రేమ భావనచుట్టూ తిరుగుతుంది. ఖవ్వాలీ అనేక మలుపులు మెలికలు తిరుగుతుంది. ఖవ్వాలీ తిరిగే మలుపులలో ఓ మలుపు వద్ద సాహిర్, అమీర్ ఖుస్రో ఖవ్వాలీ గీతాన్ని అతి సుందరంగా చొప్పించాడు కాస్త మార్చి

**బహుత్ కఠిన్ హై డగర్ పన్ ఘట్‌కీ**

**అబ్ క్యా భర్ లావూం మై జమునా సే మట్కీ**

**మై జో చలీ జల్ జమున భరన్ కో**

**నంద కిషోర్ మోహె రోకే ఝూడోన్‌తో**

**క్యా భర్ లావూన్ మై జమూన సే మట్కీ**

**అబ్ లాజ్ రాఖో మోరె ఘూంఘట్ పట్‌కీ**

'ఖుస్రో' గీతంలో చిన్న చిన్న మార్పులు చేశాడు సాహిర్. 'బావి'ని జమున చేశాడు. నిజాముద్దీన్ ప్రస్తావన తొలగించి నందకిషోర్‌ను ఆస్థానంలో ఉంచాడు. గోపిక, కృష్ణుల ప్రేమ సూఫీ ప్రేమ స్థానాన్ని ఆక్రమించింది.కానీ ప్రధానంగా పాట ప్రస్తావించినది సూఫీ సిద్ధాంతాలనే, కానీ హైందవ ప్రతీకలతో.

తరువాత చరణంలో సాహిర్ 'ప్రేమ'ను భగవంతుడి స్థాయికి ఎదిగింపచేశాడు. ఇది కూడా 'సూఫీ' సిద్ధాంతమే. అయితే, ఈ భగవంతుడి స్థాయికి ఎదిగింప చేయటంలో లౌకిక భావనలు ప్రదర్శిస్తూ అందరు దేవుళ్లనూ 'ప్రేమ ' అన్నాడు.

జబ్ జబ్ కృష్ణ కి బన్సీ బాజే, నిక్‌లీ రాధా సజ్‌కే

జాన్ అజాన్ క మాన్ భులాకే లోక్ లాజ్‌కో తజ్ కే

జనక్ దులారీ బన్ బన్ డోలే, పహన్ కే ప్రేమ్ క మాలా

దర్శన్ జల్ కీ ప్యాసీ మీరా పీగయి విష్ కీ ప్యాలా

ఔర్ ఫిర్ అర్జ్ కరీకీ

య్ ఇష్క్ ఇష్క్ ఇష్క్ హై ఇష్క్ ఇష్క్

కృష్ణుడి మురళీగానం విన్న రాధ నిలవలేక, లోకాన్ని, నీతిని, సిగ్గునూ, అన్నిటినీ వదిలి వచ్చేసింది. ప్రేమకోసం సీత రాముడితో అడవిలోకి వచ్చేసింది. ప్రేమ కోసం  మీరా విషాన్ని ప్రేమతో స్వీకరించింది. ఎందుకంటే, ఇదంతా 'ప్రేమ' అన్నమాట. పురాణ ప్రతీకల ఆధారంతో   భౌతిక ప్రేమకు  దైవం స్థాయి ఆపాదించి, సమాజంలో భౌతిక ప్రేమనే 'దైవం' అన్న భావనను స్థిరపరచటం స్పష్టంగా తెలుస్తుంది. మన సినిమా 'ప్రేమలు' చేసిన పని ఇది. 'అమీర్ ఖుస్రో' ప్రచారానికి తెచ్చిన ప్రేమ భావన వేరు. అమీర్ ఖుస్రో ప్రభావంతో తరువాత కవులు  సమాజంలో విస్తరింపచేసిన  ప్రేమ భావన వేరు. ఆధునిక సమాజంలో స్థిరపడ్డ ప్రేమ భావన వేరు.

అల్లాహ్, రసూల్ కా ఫర్మాన్ ఇష్క్ హై

యానె హఫీజ్ ఇష్క్‌హై, ఖురాన్ ఇష్క్ హై

గౌతం కా ఔర్ మసీహా కా అర్మాన్ ఇష్క్ హై

యే కాయినాత్ జిస్మ్ హై, ఔర్ జాన్ ఇష్క్ హై

**ఇష్క్ సర్మద్, ఇష్క్ హీ మన్సూర్ హై**

**ఇష్క్ మూసా, ఇష్క్ కోహ్ – ఇ – నూర్ హై**

**ఖాక్ కో బుత్, ఔర్ బుత్ కో దేవతా కర్తా హై ఇష్క్**

**ఇంతహా యేహై కి బందే వో ఖుదా కర్తాహై ఇష్క్**

ఇలా అన్నిమతాల దేవుళ్లూ 'ప్రేమ ' అని చెప్పి, బూడిదను విగ్రహంలా, విగ్రహాన్ని దేవతలా మారుస్తుంది ప్రేమ అని ఎంతో శక్తిమంతంగా చెప్పాడు సాహిర్. రోషన్ అత్యద్భుతమైన సంగీత దర్శకత్వంలో మన్నాడే, రఫీ, ఆశా, సుధ మల్హోత్రాలు అత్యద్భుతంగా పోటీ పడి పాడారు. పాట చిత్రీకరణ కూడా సందర్భోచితంగా ఉంటుంది.

కృష్ణుడి మురళీగానం విని రాధ అన్నీ వదలి వచ్చేసిందన్నప్పుడు, తండ్రి మాట కాదని నాయిక నాయకుడి కోసం ఖవ్వాలీ జరుగుతున్న స్థలానికి వచ్చేస్తుంది. 'మీరా విషం స్వీకరించింది ప్రేమలో అన్నప్పుడు నాయకుడిని రహస్యంగా ప్రేమిస్తూన్న ఆమె, నాయిక రావటం చూసి మూర్ఛపోతుంది. ఈ రకంగా పౌరాణిక గాథలను, ప్రేమగాథలుగా మార్చి, మామూలు ప్రేమ మనుషుల్ని దైవంలా మారుస్తుందన్నది ప్రతిభావంతంగా చెప్పటంతో ప్రేమలోని భగవద్భావన అదృశ్యమై తొందరపాటు, ఆవేశం, ఆకర్షణ, లైంగిక తపనలు దైవ సమానమైన ప్రేమకు అసలైన అర్థాలుగా సమాజంలో స్థిరపడ్డాయి.

దర్గాలలో భగవంతుడిని తలుస్తూ పాడే ఖవ్వాలీలు, ప్రేమ పాటల పోటీలుగా (తేరి మహెఫిల్ మె కిస్మత్ ఆజ్మాకర్ – మొఘల్ ఎ అజాం) ప్రేయసి వదనంపై ముసుగు తొలిగిస్తానని ఛాలెంజ్ చేసే పాటగా (పర్దాహై పర్దా – అమర్ అక్బర్ ఆంథోనీ) తండ్రిని ధిక్కరించి అందరి ముందు తన ప్రేమను ప్రకటించే ఛాలెంజ్ పాటగా (హై అగర్ దుష్మన్ జమానా – అమర్ అక్బర్ ఆంథోనీ) కొట్లాట పాటలా (రాజ్ కీ బాత్ కహదూతో – ధర్మ) రూపాంతరం చెందాయి. ఖవ్వాలీ అసలు ఉద్దేశ్యం మరుగునపడింది. పిల్లలకు, తొందరపడవద్దు, ఆకర్షణను ప్రేమ అని భ్రమ పడవద్దని మంచి చెప్పే తల్లిదండ్రులు పవిత్రప్రేమకు అడ్డుపడే 'ఉల్ఫత్‌కే దుష్మన్' (ప్రేమ వ్యతిరేకులు) అయిపోయారు.

**ఉల్ఫత్ కె దుష్మనోనే కోషిష్ హజారో కీ**

**ఫిర్ భీ నహీ ఝుకీ ఉస్ నజర్ కో సలామ్...**

పాట చిత్రీకరణలో ఉల్ఫత్ కే దుష్మనోంనే అన్నప్పుడు అమ్మాయి వెనక వస్తున్న తల్లిని చూపించటంతో ప్రేమ శత్రువులెవరో స్పష్టమవుతుంది. ప్రేమను భౌతిక ఆకర్షణ స్థాయికి దింపటంతో పాటూ తల్లితండ్రులను పిల్లల దృష్టిలో విలన్లు చేసి పిల్లలు తాలితండ్రుల సంబంధాన్ని ధ్వంసం చేయటంలోనూ సినిమాలు విజయం సాధించాయి.

తల్లిదండ్రులను ఎదిరించి, కాదని పారిపోయి పెళ్లి చేసుకోవటం 'దైవ కార్యం' అయిపోయింది ఆధునిక సమాజంలో. ఓ ఏడువందల ఏళ్ల తరువాత తాను ప్రచారం చేసిన 'భగవంతుడి ప్రేమ ' ఇలా 'ఆకర్షణే భగవంతుడు' అనే స్థాయికి దిగజారుతుందని ఖుస్రో కలలో కూడా ఊహించి ఉండదు.

(వచ్చేనెల మరిన్ని పాటలతో కలుద్దాం..)

Click here to share your comments